క్లుప్తంగా

మలకపల్లిలో 100 మందికి కంటి పరీక్షలు



మలకపల్లిలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

తాళ్లపూడి: లయన్స్ క్లబ్ మండల శాఖ ఆధ్వర్యంలో మలకపల్లి గ్రామంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నిడదవోలుకు చెందిన శ్రీమతి రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ కంటి ఆసుపత్రి సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆ కంటి వైద్యశాల డాక్టర్ సీహెచ్ నాగరాజు సుమారు 100 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 25 మంది ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. 40 మంది మందులు, 11 మంది కళ్లజోళ్లకు ఎంపికయ్యారు. వైద్య శిబిరంలో లయన్స్ క్లబ్ మండల శాఖ అధ్యక్షుడు కుంటముక్కల వీరభద్రరావు, సభ్యులు మారిన రామ్మూర్తి, దుగ్గిరాల ప్రకాష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మంత్రోచ్ఛరణలతో మార్మోగిన యాగశాల

తాళ్లపూడి: వేద పండితుల మంత్రోచ్ఛరణలతో యాగశాల మార్మోగింది. మహా కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా స్థానిక నవదుర్గ, శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే శతచండీ హోమం మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. శతాధిక ప్రతిష్ఠా సిద్ధాంతి శ్రీ సిద్ధేశ్వర కార్తికేయ శివాచార్య గురువు ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు అల్లూరి ప్రసాద్, ఇతర వేద పండితులు యాగశాలలో పలు రకాల క్రతువులు నిర్వహించారు. 50 మంది దంపతులు పీటలపై కూర్చుని హోమ పూజలు చేశారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త రాధామనోహర్ దాస్, ఆలయ నిర్వాహకులు నీలి సూర్యనారాయణ, నీలి శ్రీనివాస్, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పన్ను బకాయిదారులపై అధికారుల కొరడా



బకాయిదారుడి కుళాయి కనెక్షన్ తొలగిస్తున్న మున్సిపల్ ఆర్ఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది

నిడదవోలు: మున్సిపాలిటీ పరిధిలో ఇంటి, కుళాయి పన్ను బకాయిదారులపై అధికారులు కొరడా రుళిపించారు. భారీగా ఇంటి, కుళాయి పన్నులు బకాయి పడిన వారి ఇళ్లకు మంగళవారం మున్సిపల్ రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు తన సిబ్బందితో వెళ్లారు. మంచినీటి కనెక్షన్లు కట్ చేసి నీటి సరఫరాను నిలుపుదల చేశారు. మున్సిపల్ చట్టం– 1965 అనుసరించి మంచినీటి కనెక్షన్లను తొలగించి మొండి బకాయిదారుల నీటి సరఫరా బంద్ చేస్తున్నట్టు కమిషనర్ టి. కృష్ణవేణి తెలిపారు. ఇంటి, కుళాయి పన్నులు వెంటనే చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి కృషి చేయాలని పట్టణ ప్రజలను ఆమె కోరారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నిడదవోలు రూరల్: ప్రజల చెంతనే ఏర్పాటు చేస్తున్న ఆధార్ కేంద్రాల సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి కుంచాల శ్రీనివాస్‌రెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ పి.నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలో నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వీఎస్ రామారావు కోరారు. చివటం, పాలంగి, సత్యవాడ, వడ్లూరు గ్రామాల్లో మంగళవారం ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ వరకూ ఆధార్ నమోదు శిబిరాలు కొనసాగుతాయన్నారు.

తెలికిచెర్ల మాజీ సర్పంచ్ శ్రీరామరాజు మృతి



నల్లజర్ల: తెలికిచెర్ల పంచాయతీ మాజీ సర్పంచ్ రాజా కాకర్లమూడి శ్రీరామరాజు(రాంబాబు) (84) ఈనెల18న మృతి చెందినట్టు ఆయన కుమారులు సతీష్ వర్మ, సురేష్ వర్మ సోమవారం తెలిపారు. ఆయన తెలికిచెర్లకు ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆయన హయాంలోనే గ్రామంలో రక్షిత మంచి నీటి పథకాలు, రహదారులు, బలహీనవర్గాల వారికి పక్కా ఇళ్లు ఏర్పాటు చేశారు. శ్రీరామరాజు తండ్రి సుబ్బరాజు, తాత రమణయ్య రాజులు తెలికిచెర్ల సంస్థానానికి జమీందారులుగా వ్యవహరించారు. వారి హయాంలోనే గ్రామంలో ప్రకటేశ్వరస్వామి, వేంకటేశ్వర స్వామి ఆలయాలకు 90 ఎకరాల భూమిని దానంగా ఇచ్చారు.

అసంపూర్తిగా క్రీడా వికాస కేంద్రం

- ఎనిమిదేళ్లుగా పడకేసిన పనులు
- 2016–17లో నిధులు మంజూరు
- రూ. 2 కోట్ల కేటాయింపు



దేవరపల్లి ఏఎస్ఎన్ జెడ్పీ హైస్కూల్లో అసంపూర్తిగా ఉన్న క్రీడా వికాస కేంద్రం



జెడ్పీ హైస్కూల్ మైదానంలో క్రీడాకారుల సందడి



2016లో దేవరపల్లిలో వేసిన వికాస కేంద్రం శంకుస్థాపన శిలాఫలకం

దేవరపల్లి: ఆలోచన మంచిదే.. ఏళ్లు గడుస్తున్నా ఆచరణకు మాత్రం నోచుకోలేదు. ప్రతి నియోజకవర్గానికీ అన్ని వసతులతో కూడా క్రీడా వికాస కేంద్రాలు అందుబాటులోకి వస్తే క్రీడా రంగంలో యువత మరింత ఉత్సాహంగా ముందుకు దూసుకుపోతుంది. క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడంతో పాటు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడానికి అన్ని వసతులతో కూడిన క్రీడా వికాస కేంద్రాల నిర్మాణానికి 2015–16లో అప్పటి టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో క్రీడా వికాస కేంద్రం ఏర్పాటుకు స్థల సేకరణ చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. తొలుత 75 నియోజకవర్గాల్లో వికాస కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలకు ఈ కేంద్రాలు మంజూరయ్యాయి. ఒక్కొక్క కేంద్రానికి రూ.2.10 కోట్ల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. గోపాలపురం నియోజకవర్గానికి దేవరపల్లిలోని అంబటి సత్యనారాయణరావు జెడ్పీ హైస్కూల్లో వికాస కేంద్రం ఏర్పాటుకు 2013–14లో అప్పటి ఏఎంసీ చైర్మన్, ప్రస్తుత దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు, దేవరపల్లి హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అనంతరం 2014–15లో టీడీపీ ప్రభుత్వంలో పేరం రవీంద్రనాథ్ శాప్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. దేవరపల్లిలో క్రీడా వికాస కేంద్రం మంజూరుచేస్తూ 2016లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2016 నవంబరు 6న అప్పటి క్రీడల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర క్రీడా వికాస కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేసి ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. ప్రారంభించిన పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. అప్పట్లో కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. రూ.2.10 కోట్లు మంజూరు కాగా, రూ.25 లక్షలు చెల్లించినట్టు తెలిసింది.

అన్ని సదుపాయాలతో వికాస కేంద్రం

క్రీడాకారులకు అవసరమైన అన్ని సౌకర్యాలతో క్రీడా వికాస కేంద్రం నిర్మిస్తారు. వికాస కేంద్రానికి కోచ్‌ను నియమించి రోజూ క్రీడాకారులకు శిక్షణ ఇస్తారు. క్రీడా ప్రాంగణంలో అన్నిరకాల క్రీడా కోర్టులు ఏర్పాటు చేస్తారు. జిమ్, బాలికలు, బాలురు దుస్తులు మార్చుకునే గదులు, రెండు ఉడెన్ షటిల్ కోర్టులు, టేబుల్ టెన్నిస్, బాస్కెట్ బాల్, వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేయాలి. క్రీడా మైదానాన్ని మెరక్ చేసి క్రీడాకారులకు అసౌకర్యం కలగకుండా చూడాలి. 50 మంది క్రీడాకారులకు వసతి సదుపాయం కల్పించవలసి ఉంది. నియోజకవర్గస్థాయిలో జరిగే క్రీడా పోటీలు ఇక్కడ నిర్వహిస్తారు.

క్రీడా పటంలో దేవరపల్లికి గుర్తింపు

క్రీడా పటంలో దేవరపల్లికి గుర్తింపు లభించిందనడంలో అతిశయోక్తి లేదు.1994 ఆగస్టు 9న పేరం రవీంద్రనాథ్ టి.నర్సాపురం జెడ్పీ హైస్కూల్ నుంచి బదిలీపై దేవరపల్లి హైస్కూల్‌కు వచ్చారు. అప్పటి వరకూ క్రీడలంటే తెలియని ఈ ప్రాంత విద్యార్థులకు క్రీడల పట్ల అవగాహన కల్పించి విద్యార్థులకు పలు రకాల క్రీడల్లో శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. ముళ్ల పొదలతో ఉన్న క్రీడా మైదానాన్ని శుభ్రం చేసి క్రీడా కోర్టులు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు దేవరపల్లిలో నిర్వహించే స్థాయికి ఈ హైస్కూలు ఎదిగింది. దాదాపు 22 ఏళ్లు రవీంద్రనాథ్ ఇక్కడ పీడీగా పనిచేసి వందలాది మంది జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేశారు. ఇక్కడ వికాస కేంద్రం నిర్మాణం పూర్తయితే ఎంతో మంది క్రీడాకారులకు ఉపయోగకరంగా ఉంటుంది.

ప్రభుత్వం సుముఖత



క్రీడా వికాస కేంద్రాల నిర్మాణాలకు ప్రభుత్వం సుముఖంగా ఉంది. రాష్ట్రంలోని 35 క్రీడా వికాస కేంద్రాలను పూర్తి చేయడానికి ఇటీవల ప్రభుత్వం రూ.23 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దేవదరపల్లిలో అసంపూర్తిగా ఉన్న వికాస కేంద్రం నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. మెట్ట ప్రాంతంలోని గ్రామీణ క్రీడాకారులకు ఈ వికాస కేంద్రం అందుబాటులోకి వస్తే ఎంతో మేలు చేకూరుతుంది. ఇద్దరు కోచ్‌లు నిరంతరం ఇక్కడ ఉండి క్రీడాకారులకు శిక్షణ ఇస్తారు. శంకుస్థాపన చేసి ఎనిమిదేళ్లు అయింది.

– పేరం రవీంద్రనాథ్, శాప్ మాజీ డైరెక్టర్, దేవరపల్లి

ఇష్ట ప్రకారం రైతులు ధాన్యం అమ్ముకోవచ్చు

- జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు
- ప్రకాశరావుపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి రైతులతో మాట్లాడుతున్న జేసీ చిన్న రాముడు

నల్లజర్ల: ఖరీఫ్ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని రైతులు తమ ఇష్ట ప్రకారం అమ్ముకోవచ్చని జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు స్పష్టం చేశారు. మండలంలోని ప్రకాశరావుపాలెం రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో గణనీయంగా ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నామన్నారు. ఈ సీజన్‌లో మండలం నుంచి 19 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యమన్నారు. ఇందుకోసం 5.13 లక్షల గోనె సంచులు అవసరం కాగా ఇప్పటికే 63 వేల సంచులను సిద్ధం చేసినట్టు చెప్పారు. ఎప్పటి ధాన్యాన్ని అప్పుడే కళ్లాల్లోనే కొనుగోలు చేస్తారన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు రైతుల కళ్లాల వద్దకు వచ్చి ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తారన్నారు. గత రెండేళ్లలో ధాన్యం అమ్మకాల వేళ రైతులు పడిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ సీజన్ నుంచి ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం కొన్ని నిబంధనలు సడలించిందన్నారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత మాట్లాడుతూ రైతుల సమస్యలు ఎప్పటికపుడు తెలుసుకునేందుకు రెవెన్యూ డివిజన్ కేంద్రంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.అలాగే రైతు సేవా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు నియమ నిబంధనలు తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రకాశరావుపాలెం సర్పంచ్ జాన్ విక్టర్, ఉప సర్పంచ్ యద్దనపూడి బ్రహ్మరాజు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ శాంతిప్రియ, ఎంపీడీఓ సింహాద్రి, మండల వ్యవసాయాధికారి కమల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు



ప్రతిభ చూపిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేసిన డిపో మేనేజర్ వైవీఎస్ కుమార్

కొవ్వూరు: స్థానిక ఆర్టీసీ డిపోలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు గ్యారేజీ ఆవరణలో మంగళవారం అభినందన సభ నిర్వహించారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో అత్యధిక ఆదాయం ఆర్జించడమే గాకుండా, ఎక్కువ ఆయిల్ ఆదా చేసిన కండక్టర్లు, డ్రైవర్లకు నగదు పారితోషికాలతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశామని డిపో మేనేజర్ వైవీఎస్ కుమార్ తెలిపారు. ఆగస్టులో ఎండీ రఫీవుల్లా, బి.పార్వతి, కేవీ రావు, సెప్టెంబర్‌లో జీవీ కుమార్, ఎండీ రఫీ వుల్లా, కేఎస్ మన్యం అనే కండక్టర్లు చక్కటి ప్రతిభ కనబరిచి అధికాదాయం తీసుకొచ్చారన్నారు. ఆయిల్‌ను ఆదా చేయడంలో ఆగస్టు నెలలో వైడీ రావు, జీఎస్ రావు, సెప్టెంబర్‌లో యూవీ రావు, పి.శేఖర్ అనే డ్రైవర్లు ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. దసరా సందర్భంగా ఏడీసీ కేడీ రావు, డ్రైవర్ ఎస్వీ రావు, కండక్టర్లు కేవీవీఎస్ఎన్ మూర్తి, పి.లక్ష్మి, ఎస్వీ లక్ష్మి, మెకానిక్ సీఎస్వీ కుమార్, ఔట్ సోర్సింగ్ శ్రామిక్ ఏవీ దుర్గేష్‌లు అధికాదాయం తీసుకొచ్చిన వారిలో ముందు వరుసలో ఉన్నారన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపిన కండక్టర్లు ,డ్రైవర్లను అభినందించారు. డిపో మేనేజర్ చేతుల మీదుగా ప్రశంసా ప్రతాలు, నగదు పారితోషికాలు అందజేశారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలిపివేయాలి

మాల సంఘాల జేఏసీ డిమాండ్



గోపాలపురంలో మాట్లాడుతున్న మాల సంఘాల నాయకుడు బొంతా శ్యామ్ రవిప్రకాశ్

గోపాలపురం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యోచనను విరమించుకోవాలని మాల సంఘాల రాష్ట్ర జేఏసీ కన్వీనర్ బొంతా శ్యామ్‌రవిప్రకాశ్ డిమాండ్ చేశారు. మండలంలోని వేళ్లచింతలగూడెంలోని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దొడ్డి వెంకటేశ్వర్లు నివాసం వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశంలో శ్యామ్ రవిప్రకాశ్ మాట్లాడారు. 32 మంది ప్రాణత్యాగంతో సంపాదించుకున్న స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేయాలనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. సుమారు రూ.నాలుగు లక్షల కోట్ల విలువైన స్టీల్ ప్లాంట్‌ను రూ.41 వేల కోట్లకు విక్రయించడం బాధాకరమన్నారు. గంగవరం పోర్టును ప్రైవేట్‌పరం చేసి స్టీల్ ప్లాంట్‌పై భారం పెంచారన్నారు. కావాల్సినంత ఐరన్ ఓర్ అందించకుండా 2019లో లాభాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల ఊబిలోకి దింపారన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.38 వేల కోట్లు కేటాయించి స్టీల్ ప్లాంట్ కార్మికులను ఆదుకోవాలని శ్యామ్ రవిప్రకాశ్ డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకున్నప్పుడే దాని ఏర్పాటుకు పాటుపడిన అమృతరావుకు నిజమైన నివాళులు అన్ని రవిప్రకాశ్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలి పెట్టి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు ప్రతి పక్షపార్టీలపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడం సిగ్గు చేటన్నారు. ఆయన వెంట మాల మహానాడు గోపాలపురం అధ్యక్షుడు కొయ్య వెంకటరమణ, మండలంలోని మాల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పెళ్లికి వెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల

కొవ్వూరు బ్రిడ్జిపేటలో చోరీ

కొవ్వూరు: రోడ్డు కం రైల్ వంతెన దిగువన పట్టణంలోని స్థానిక బ్రిడ్జిపేటలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఇక్కడ నివసించే కల్లూరి వెంకట సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి ఇంట్లో ఆదివారం రాత్రి దొంగతనం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఆయుర్వేద ఉత్పత్తుల వ్యాపారం చేస్తున్న సుబ్రహ్మణ్యం కుటుంబం ఈనెల 20న ఇంటికి తాళాలు వేసి గుడివాడలోని బంధువుల ఇంటికి వివాహానికి వెళ్లారు. తిరిగి రాత్రి 12 గంటల సమయంలో తిరిగి వచ్చేసరికి మెయిన్ డోర్‌కి వేసిన తాళం పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువా తాళాలు పగలగొట్టి, అందులో దాచిన రూ.50వేల నగదు, ల్యాబ్ ట్యాబ్ దొంగిలించుకుని పోయినట్టు నిర్ధారించారు. వెంకట సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ పి.విశ్వం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధ్వర్యంలో వేలిముద్రలు సేకరిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ విశ్వం తెలిపారు.

కొత్త వరి వంగడాల దిగుబడి ఆశాజనకం

- జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు
- పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది



వేగేశ్వరపురంలో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు



ఆయిల్ పామ్‌లో తెగుళ్ల నివారణపై రైతులకు వివరిస్తున్న ఉద్యాన శాఖాధికారి బబిత

తాళ్లపూడి: ఈ ఖరీఫ్‌లో రైతులు ప్రయోగాత్మకంగా సాగు చేసిన కొత్త వరి వంగడాల దిగుబడి ఆశాజనకంగా ఉందని జిల్లా ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు పేర్కొన్నారు. మండలంలోని వేగేశ్వరపురం, తాళ్లపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన నరసింహారావు, శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్‌లు ఖరీఫ్‌లో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న వరి చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ పరిశోధన నిమిత్తం ఈ ఖరీఫ్‌లో సాగు చేసిన కొత్త వరి వంగడాలైన బీపీటీ– 3082, బీపీటీ– 2841(నల్ల బియ్యం), బీపీటీ –2858 (ఎర్ర బియ్యం) పంటలు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. బీపీటీ– 2858 (ఎర్ర బియ్యం) రకం గాలులకు నేలకు వరగకుండా , సుడిదోమ తెగులును తట్టుకుని, వరికంకి నిండా గింజలతో ఆశాజనకంగా ఉందన్నారు. బీపీటీ –2841 పంట కోత ప్రయోగంలో ఎకరాకు 36 బస్తాల (75 కిలోలు)దిగుబడి వచ్చిందని తెలిపారు. ఎర్ర బియ్యం, నల్ల బియ్యం ఆరోగ్యానికి మంచిదని, మంచి పోషక విలువలు కలిగినవని చెప్పారు. సేంద్రియ విధానంలో పండిస్తే పంటకు మార్కెట్‌లో మంచి రేటు వస్తుందన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో వచ్చే రబీలో ఎంటీయూ– 1121, ఎంటీయూ– 1293, ఎస్ఎల్ఆర్– 34449 వంటి సాగుకు అనుకూలమైన రకాలను సాగు చేయాలన్నారు. మినుము పంటలో చిత్త పురుగు, పల్లాకు తెగులు గుర్తించి రైతులకు నివారణ చర్యలు సూచించారు.కార్యక్రమంలో ఏడీఏ ఎస్. జయరామలక్ష్మి, ఏవో జి.రుచిత, బి.వెంకన్నబాబు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

నల్లజర్ల: ఆయిల్‌పామ్ తోటలకు సోకిన కొమ్ము, ఎర్రముక్క పురుగు నివారణకు రైతులు సత్వర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శేషకిరణ్ సూచించారు. మండలంలోని సుభద్రపాలెం, అనుమునిలంక గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయిల్‌పామ్ తోటల్లో ప్రధానంగా కాండం తడి కుళ్లు, మొవ్వ కుళ్లు, రూగోస్ తెల్లదోమ, కొమ్ము పురుగు తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కొమ్ము పురుగులు ముదురు ఆకులపై వి ఆకారంలో కత్తిరించినట్టుగా ఉండి మొవ్వులో పురుగు తొలచిన రంధ్రాలు కనబడతాయన్నారు. పురుగు ఆశించన తోటల్లో దిగుబడులు తగ్గడమే గాకుండా కొన్నిచోట్ల చిన్న మొక్కలు చనిపోయే అవకాశం కూడా ఉందన్నారు. తొలుత మొవ్వ కుళ్లపోయి ఆ భాగం నుంచి వచ్చే పులిసిన వాసనకు కొబ్బరిలో కాండం తొలిచే ఎర్రముక్కు పురుగు ఆశిస్తుందన్నారు. సేంద్రియ ఎరువు కుప్పలపైన, చనిపోయిన మొక్కల మొదళ్లలో గుడ్లు పెట్టి పురుగుల ఉధృతి పెరుగుతుందన్నారు. పడిపోయిన చెట్లను మొదళ్ళతో సహా తొలగించి తగలబెట్టాలన్నారు. తోటలో వేసిన పశువుల పెంటను ప్రతి మూడు నెలలకు ఒకసారి తిరగ వేసి కొమ్ము పురుగులను నిర్మూలించాలన్నారు. మూడు నెలలకు ఒక సారి మొవ్వ, ఆకు వలయాలలో 150 గ్రాముల ఇసుకలో వేపపిండి 100 గ్రాములు వేసి చల్లాలన్నారు. లింగాకర్షక బుట్టలు ప్రతి రెండు ఎకరాలకు ఒక చోట ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యానఅధికారి బబిత, వ్యవసాయశాఖ ఏఈఓలు పుష్పలత, పామర్తి సురేష్, త్రీఎఫ్ ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామ సభలు



కాపవరం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ అచ్యుతకుమారి

పెరవలి: భూముల సర్వే నిర్వహించిన గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ డి.అచ్యుతకుమారి అన్నారు. మండలంలోని కాపవరంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు.తహసీల్దార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆరు పంచాయతీల్లో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించగా, 55 అర్జీలు వచ్చాయన్నారు. ఒక్క కాపవరం సభలో 20 అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సిండికేట్‌లో చేరతారా? లేదా?



ఖండవల్లిలోని మద్యం షాపు

పెరవలి: ముందు చూస్తే నుయ్యి – వెనుక చూస్తే గొయ్యి అన్న చందంగా మారింది మండలంలో మద్యం షాపుల లైసెన్సులు దక్కించుకున్న వారిలో ఇద్దరి పరిస్థితి. లక్కీ డ్రా ద్వారా మండలానికి ఐదు మద్యం షాపులు కేటాయించారు. వాటిలో మూడు షాపుల యజమానులు సిండికేట్‌గా ఏర్పడ్డారు. మిగిలిన రెండు షాపుల వారిని కూడా సిండికేట్‌లో చేరాల్సిందే అంటూ ఒత్తిడి తెస్తున్నారు. తాము సిండికేట్‌లో కలవబోమని ఈ రెండు షాపుల యజమానులు స్పష్టం చేస్తున్నారు. 'మీరెలా అంటే అలా చేస్తాం. ఎవరికి ఎంత ఇవ్వాలో చెబితే అలా ఇచ్చివేస్తాం' అంటూ ఖరాకండిగా చెప్పడంతో సిండికేట్ ఖంగుతింది. సిండికేట్‌గా ఏర్పడిన వారు ఈ విషయాన్ని అధినాయకుడి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన తన పీఏతో ఇద్దరు మద్యం షాపుల యజమానులకు ఫోన్ చేయించి సిండికేట్‌లో కలవాలని ఆదేశాలు ఇచ్చినట్టు తెలిసింది. పదుల్లో టెండర్లు వేస్తే ఒక్క షాపు తగిలింది. ఇప్పుడు వ్యాపారం చేయకుండా సిండికేట్‌లో కలపాలని ఒత్తిడి తేవడం ఏమిటని? రెండు షాపుల యజమానులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు గ్రామాల్లో కూటమి నాయకులు తమకు వాటాలు ఇస్తేనే షాపుల నిర్వహణ సక్రమంగా ఉంటుంది. లేకపోతే ఇబ్బందుల తప్పవని హెచ్చరికలు జారీ చేస్తున్నట్టు సమాచారం .మరోవైపు ఆ రెండు షాపుల పరిధిలోనూ సిండికేట్ బెల్ట్ షాపుల ఏర్పాటు చేసి పబ్లిక్‌గా మద్యం అమ్మకాలు సాగిస్తున్నాయి. ఇప్పటికే నిడదవోలు నియోజకవర్గంలోని ఉండ్రాజవరం, నిడదవోలు మండలాల్లో సిండికేట్‌గా ఏర్పడటానికి రంగం సిద్ధం అవుతుండగా, పెరవలి మండలంలో మా త్రం ఆ పంచాయితీ ఇంకా ఓ కొలిక్కి వచ్చినట్టు లేదు.

ఒక పంచాయతీకి ఒకే సచివాలయం

- జిల్లా సర్పంచుల చాంబర్ అధ్యక్షుడు లక్ష్మణరావు విజ్ఞప్తి
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



జిల్లా కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం ఇస్తున్న లక్ష్మణరావు, సర్పంచులు

కొవ్వూరు: ఒక గ్రామ పంచాయతీ పరిధిలోని సచివాలయాలన్నింటినీ కలిపి ఒక సచివాలయంగా ఏర్పాటు చేయాలని జిల్లా సర్పంచుల చాంబర్ అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన రాజమహేంద్రవరంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. ఒక్కో గ్రామ పంచాయతీ పరిధిలో రెండు నుంచి గరిష్ఠంగా ఐదు సచివాలయాలు ఉన్నాయన్నారు. ఒక్కో సచివాలయంలో 11 మంది ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు. అవసరానికి మించి ఉద్యోగులు ఉండడంతో వారంతా పని లేక ఖాళీగా ఉంటున్నారన్నారు. ఒక్కో పంచాయతీకి ఒక సచివాలయాన్ని మాత్రమే ఏర్పాటు చేస్తే సరిపోతుందన్నారు. సచివాలయ సిబ్బంది పంచాయతీ ఆధీనంలో పని చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సచివాలయ ఉద్యోగుల హాజరు చూసేది ఒకరు, పనితీరును విశ్లేషించేది మరొకరు కావడంతో ఎవరి ఆదేశాలు పాటించాలో తెలియని పరిస్థితుల్లో వారు విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని లక్ష్మణరావు కోరారు. సర్పంచులు ఉప్పులూరి ముని రాజేంద్ర ప్రసాద్ (బాబ్జీ), మేకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.